## క్లుప్తంగా

### డిప్యూటీ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



మేయర్ వసీంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ డి.పావని

**అనంతపురం కార్పొరేషన్:** నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ డి.పావని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మొదట ఆమె కమిషనర్ బాలస్వామి వద్ద రిపోర్టు చేసుకున్నారు. అనంతరం మేయర్ వసీంను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నగరాభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని, అంకితభావంతో పని చేయాలని మేయర్ సూచించారు.

### ‘దళితుల గ్రామ బహిష్కరణ దారుణం’

**అనంతపురం టవర్‌క్లాక్:** కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలో దళితులను గ్రామం నుంచి బహిష్కరించడం దారుణమని ఏపీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కటిక జయరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల క్రితం దళిత యువకుడు సురేష్ విద్యుత్ షాక్‌తో మరణిస్తే న్యాయం చేయాలంటూ దళితులు నిరసన తెలిపారన్నారు. అందుకు గ్రామంలోని అగ్రవర్ణాల వారు కోపంతో దళితులను గ్రామం నుంచి బహిష్కరించడం దుర్మార్గమన్నారు. ఇంత జరుగుతున్నా పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

### పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ఆత్మకూరులో పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

**ఆత్మకూరు:** ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలు అన్ని రకాల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను కోరుతున్నారు. సోమవారం ఆత్మకూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆత్మకూరులో పర్యటించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పేద ముస్లింలకు ఉచిత ఖత్నాలు

**అనంతపురం కల్చరల్:** ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద ముస్లింలకు ఉచిత ఖత్నా (ఒడుగులు) నిర్వహిస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ అన్నారు. ఈ మేరకు సోమవారం పాతూరులోని గఫూర్ కాన్ఫరెన్సు హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సున్తీ (ఒడుగు) చేయించుకోవడం మంచిదని శాస్త్రీయంగా కూడా తేలిందన్నారు. హెచ్ఐవీ, యూటీఐ, సుఖ వ్యాధుల నుంచి బయటపడడానికి ముస్లిం సంప్రదాయంలో ఖత్నాలు జరుగుతాయన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడేవారి కోసం ఉచితంగా ఈనెల 27న పాతూరు తాడిపత్రి రోడ్డు గఫూర్ కాలనీలో ఉదయం 9 గంటలకు ఖత్నాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989204621 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో షబ్బీర్, హారిక, సోఫియా, హరిత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో మోటర్ చోరీ

**బుక్కరాయసముద్రం:** మండలంలోని నీలాంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ మోటర్ చోరీ అయిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పాఠశాలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మోటార్ విలువ 16 వేలు ఉంటుంది. ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఎస్సీ అట్రాసిటీ కేసుపై విచారణ

**గార్లదిన్నె:** ఎస్సీ అట్రాసిటీ కేసును విచారించేందుకు సోమవారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను అనంతపురంరూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సందర్శించారు. కనంపల్లికి చెందిన జానకి అనే మహిళ అదే గ్రామానికి చెందిన దళిత యువకుడిని మాదిగ కులం పేరుతో దూషించినట్లు ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దళిత సంఘాలు నాయకులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మహిళపై ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడంతో ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి డీఎస్పీ విచారణ చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఈ పాడుబడ్డ భవనంలోనే ఆహారం తయారు చేసేది



చెత్తా చెదారం పక్కనే పుల్కాలు చేస్తున్న దృశ్యం



భవనం వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం



భవనంలో పైప్‌లైన్ లీకేజీలు

# వామ్మో.. ఇదేం డైట్!

- సర్వజనాస్పత్రిలో అసౌకర్యాల నడుమ భోజనం తయారీ
- సురక్షిత ప్రమాణాలు గాలికి వదిలేసిన వైనం
- తేడా వస్తే రోగుల ప్రాణాలకే ప్రమాదం

| |
|---|
| ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నిత్యం ఓపీ సంఖ్య 2,500 నుంచి 3,000 |
| అడ్మిషన్‌లో ఉండే రోగులు 1,100 నుంచి 1,300 |
| బాలింతలు, గర్భిణులు 250 నుంచి 300 |
| రోజూ డైట్ తీసుకునే వారి సంఖ్య 700 |
| డైట్ తయారీకి ప్రతి నెలా చెల్లించే మొత్తం రూ.15 లక్షలు |

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డైట్ తయారీ ఆందోళన కలిగిస్తోంది. రోజూ వందలాది మంది రోగులకు సరఫరా చేసే ‘డైట్’ తయారీలో సురక్షిత ప్రమాణాలను గాలికొదిలేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శిథిలావస్థకు చేరిన ఏళ్ల కాలం నాటి ఇంజినీరింగ్ కార్యాలయంలో ఓ వైపు చెత్తా చెదారం, లీకేజీల మధ్యనే ఆహారాన్ని సిద్ధం చేస్తున్నారు. సామాన్లు కడిగే చోటే వంట వండుతున్నారు. ఆస్పత్రిలోని వివిధ వార్డులకు వెళ్లే సిబ్బందికి ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఉంటుంది. అయినా అలాగే వచ్చి డైట్ తయారు చేయడం చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఆస్పత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులు, క్షయ వ్యాధిగ్రస్తులు ఇలా ఎంతో మందికి డైట్ ఇవ్వాల్సి ఉంటుంది. సురక్షిత ప్రమాణాలు పాటించని నేపథ్యంలో పొరపాటున ఆహార కలుషితం జరిగితే రోగుల ప్రాణాలకే ప్రమాదం లేకపోలేదు. ప్రతి నెలా డైట్ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం రూ.15 లక్షల వరకు చెల్లిస్తున్నా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై రోగులు, బంధువులు మండిపడుతున్నారు. మరో భవనంలో ఆహారం తయారు చేస్తే బాగుంటుందని అంటున్నారు.

**కలెక్టర్ స్పందిస్తేనే..**

కూటమి ప్రభుత్వం రోగుల ప్రాథమిక అవసరాలను కూడా తీర్చడంలో విఫలమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగులకు అత్యంత కీలకమైన డైట్ తయారీ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రిని తనిఖీ చేసి, రోగులకు సురక్షిత ప్రమాణాలతో భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అసత్య ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న గాస్పెల్ అసెంబ్లీ సభ్యులు

**అనంతపురం కల్చరల్:** ఆధ్యాత్మిక బోధనలు చేయాల్సిన దైవజనులు అసత్య ఆరోపణలు చేయడం తగవని గాస్పెల్ అసెంబ్లీ సభ్యులు పేర్కొన్నారు. నగరంలోని గుల్జార్‌పేట్ గాస్పెల్ అసెంబ్లీ సంఘంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో క్రైస్తవ సంఘం పెద్దలు ఫిలిఫ్, విజయ్‌కుమార్, రాజేష్ తదితరులు మాట్లాడారు. 2017 నుంచి 2024 వరకు రిజిస్టర్ అయిన సొసైటీ ద్వారా జరిగిన ప్రతి విషయంలో పాస్టర్ వరప్రసాదరెడ్డి సంతకాలు పెట్టి సాక్ష్యంగా ఉన్నారన్నారు. ఆడిటర్ హరిశ్చంద్రరామ ద్వారా ప్రతి రూపాయికీ లెక్కలున్నాయని, డబ్బు దుర్వినియోగం చేసిన వారే ఆరోపణలు చేయడం ఎంత వరకు సబబో చెప్పాలన్నారు. మోహనరావు, పురుషోత్తం అనే వ్యక్తులు వసూలు చేసిన డబ్బును బ్యాంకులో జమ చేయకపోవడంపై అడగడమే కాకుండా పోలీసుస్టేషన్‌లో కంప్లెయింట్ వరకు వెళ్లిన విషయం గుర్తు చేశారు. ప్రస్తుతం ఆరోపణలు చేస్తున్న దేవవరం అనే వ్యక్తిని అసభ్య ప్రవర్తన వల్ల రెవరెండ్ జోసెఫ్ సంఘ బహిష్కరణ చేసిన విషయం వరప్రసాదరెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. తొలి రోజుల్లో అన్ని కరెక్టుగా ఉన్నాయని చెప్పిన సంఘ పెద్దలు తర్వాత మరోరకంగా మాట్లాడుతున్నారని, బహిరంగ విచారణకు తాము సిద్ధమన్నారు. న్యాయ పోరాటం ద్వారా కూడా వాస్తవాలను వెలికి తీయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎలమందయ్య, ప్రభాకర్, సంతప్‌కుమార్, డేవిడ్‌రాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# టాలెంట్ టెస్ట్‌లో మాంటిస్సోరి ఎలిట్ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ సమీరా

**రాప్తాడు:** ఇండియన్ నేషనల్ టాలెంట్ టెస్ట్ పోటీ పరీక్షల్లో మాంటిస్సోరి ఎలిట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ఎండీ కృష్ణ భరత్ పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఎండీ కృష్ణ భరత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలిగి తీసేందుకు నిర్వహిస్తున్న పరీక్షలో తమ విద్యార్థులు ప్రతిభ చూపడం హర్షణీయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ సమీరా మాట్లాడుతూ నేషనల్ ఒలంపియాడ్ పరీక్షల్లో 200 మంది విద్యార్థులు బంగారు పతకాలను సాధించారని, ఇది తమ పాఠశాలలకు ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం నేషనల్ ఒలంపియాడ్ పరీక్షలో మొదటి బహుమతి పొందిన వై.సమ్రిత్‌రెడ్డి, ఎస్.వెన్నెలకు ట్యాబ్‌లు, రెండో బహుమతి పొందిన హితీక్ష, షణ్ముఖ ప్రియ, వైష్ణవిలకు స్మార్ట్ వాచ్‌లు, తృతీయ బహుమతి పొందిన నిహాంత్ , పద్మశ్రీలకు హెడ్సెట్‌లను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జికి ప్రొటెక్షన్ వాల్ నిర్మించండి



తరలిమెల నాగిరెడ్డి బ్రిడ్జికి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్న వంశీ గోకుల్‌రెడ్డి

**రాప్తాడు:** పెన్నానది పరీవాహక ప్రాంతంలో నిర్మించిన తరిమెల నాగిరెడ్డి బ్రిడ్జికి సమాంతరంగా పై భాగంలో రక్షణ గోడ (ప్రొటెక్షన్ వాల్) నిర్మించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాప్తాడు మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో ఆర్‌జేసీ కల్యాణ మండపంలో జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. బ్రిడ్జికి రక్షణ గోడ నిర్మించాలని ఆయన చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులకు కలిసి కలెక్టర్‌కు విన్నవించారు. శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో 27 గ్రామాల ప్రజలు పెన్నానది వరద సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెన్నా నది వరదలను తట్టుకోవాలంటే నదీ గర్భంలో బ్రిడ్జిపై భాగాన బ్రిడ్జికి సమాంతరంగా ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలన్నారు. మాజీ ఎంపీ రంగయ్య బ్రిడ్జికి, రక్షణ గోడకు నిధులు మంజూరు చేశారని, అయితే బ్రిడ్జి మాత్రమే పూర్తి చేశారని, రక్షణ గోడ పనులు పూర్తి కాలేదన్నారు. పెన్నా నదిలో నీటి ప్రవాహం ఉన్న రోజుల్లో నది దాటడం కష్టమని, 27 గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారస్తులు తమ గ్రామాలకు వెళ్లాలంటే 40 కిలో మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే బ్రిడ్జికి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు తదతరులు పాల్గొన్నారు.

**వడ్డీతో రుణాలు రెన్యూవల్ చేయండి**

రైతుల పంట రుణాలను వడ్డీతో రెన్యూవల్ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో రైతులు పంట రుణాలన రెన్యూవల్ చేయడానికి బ్యాంకుల దగ్గరికి వెళ్తే అప్పు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నారని, రైతుల దగ్గర వడ్డీ కట్టడానికి కూడా డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.




### వైభవంగా జ్యోతుల ఉత్సవం

**కనగానపల్లి:** మండల కేంద్రమైన కనగానపల్లిలో సోమవారం ఆంజనేయస్వామి జ్యోతుల ఉత్సవం వైభవంగా జరిగింది. ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు జ్యోతులు ఎత్తుకొని గ్రామ పురవీధుల గుండా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి సమర్పించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం గ్రామ దేవతలైన సల్లాపురమ్మ, పోతలయ్యస్వాములకు బోనాలు ఉత్సవాన్ని నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

# రైతుల రుణాలు వడ్డీతోనే రెన్యూవల్ చేయాలి

- కందుకూరు కెనరాబ్యాంకు ఎదుట రైతుల ధర్నా



మాట్లాడుతున్న సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చిరుతల మల్లికార్జున

**రాప్తాడురూరల్:** రైతుల రుణాలను అసలు లేకుండా వడ్డీతో రెన్యూవల్ చేయాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరు కెనరా బ్యాంకు ఎదుట సోమవారం రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వరుస కరువులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంటే రైతులు పంటలు పెట్టుకోవడానికి బ్యాంకులు దగ్గరికి వెళ్లి లోన్ రెన్యూవల్ చేయాలని కోరితే.... అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే రెన్యూవల్ చేస్తామని బ్యాంకర్లు చెబుతున్నారన్నారు. రైతుల దగ్గర డబ్బులు లేక దిక్కుతోచని పరిస్థితుల్లో అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఇప్పటికే ఆర్థిక భారంతో పంటలు లేక పెట్టుబడులు తిరిగి రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో వడ్డీ కట్టించుకొని రెన్యూవల్ చేయాలని కోరారు. రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో 1–బీ అడంగల్ ఇవ్వకపోవడంతో రెన్యూవల్ చేయడానికి టెక్నికల్ సమస్య వస్తోందన్నారు. ఈ సమస్యను అధిగమించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి రామకృష్ణ, నాయకులు పుల్లారెడ్డి, శ్రీరాములు, నల్లప్ప, ఓపిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరేంద్ర, పెద్దన్న, ఓబులేసు, పుల్లన్న, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# మార్కులే జీవితం కాదు



తాడిపత్రి కేజీబీవీలో మాట్లాడుతున్న కౌన్సిలర్

**అనంతపురం ఎడ్యుకేషన్:** మార్కులు తక్కువ వచ్చాయనో, ఫెయిల్ అయ్యామనో, ఫెయిల్ అవుతామనే భయంతోనే విద్యార్థులు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. కేవలం మార్కులు ఒక్కటే జీవితం కాదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కౌన్సిలర్లు సూచించారు. సమగ్రశిక్ష పరిధిలోని కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు సోమవారం బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, గుత్తి, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ కేజీబీవీలలో విద్యార్థినులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలవుతున్న సందర్భంలో విద్యార్థుల్లో అనవసర భయాందోళనలు తొలగించి, మానసిక ధైర్యం నింపేందుకు ‘పదో తరగతి మార్కులే జీవితం కాదు’ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్లు కుమార్, లక్ష్మీపతి, శ్వేత, నిరంజన్ మాట్లాడుతూ పరీక్షలు, ఫలితాలు అనేవి మన ప్రయాణంలో ఒక దశ మాత్రమే అన్నారు. అంతిమ గమ్యం కాదన్నారు. మన ముందు ఉన్న ప్రపంచం ఎంతో పెద్దదనే విషయాన్ని గమనించాలన్నారు. ఆ ప్రపంచాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.

# ఇసుక, మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

**పెద్దపప్పూరు:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఇసుక మట్టిని తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న తాడిపత్రి డివిజన్ శాండ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి రామాంజులరెడ్డి అనే వ్యక్తికి చెందిన ప్రొక్లెయిన్‌తో పాటు నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పజెప్పారు. దాడి జరిగిన అనంతరం పలువురు రైతులు పోలీసులను ఆశ్రయించారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో తమకు అనుకూలమైన చోట బోర్లు వేయించి, అక్కడి నుంచి పొలాలకు పైపులైన్లు ఏర్పాట్లలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఇసుక, మట్టిని పైప్ లైన్ నిర్మాణం కోసం తరలిస్తుండగా పోలీసులు దాడులు చేసి వాహనాలను సీజ్ చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను సీజ్ చేసి తహసీల్దార్‌కు సమాచారం అందించామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ రైతులకు వివరించారు.

### భవిష్యత్ అంతా ఏఐదే

**గుత్తి:** భవిష్యత్ అంతా ఏఐ( ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)దేనని జేఎన్టీయూ మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ కళ్యాణి రాధ అన్నారు. గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఏఐ ఆవిష్కరణలు అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆధునిక మెకానికల్ సిస్టమ్స్, డిజైన్ ప్రక్రియలలో ఏఐ పరివర్తన పాత్రపై వివరించారు. ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్, స్మార్ట్ తయారీ , డిజైన్ ఆప్టిమైజేషన్ వంటి రంగాల్లో ఏఐ టెక్నాలజీ ఏకీకరణపై మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, మెకానికల్ హెచ్ఓడీ డాక్టర్ ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

### బడికెళ్లేదెలా?



వర్షపు నీటిలో నడుస్తూ పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

**ఆత్మకూరు:** వర్షం వస్తే తాము పాఠశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షపు నీళ్లలో చాలా సార్లు కొందరు విద్యార్థులు కింద పడ్డారు. ఇప్పటికైనా వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి’ అని విద్యార్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఆత్మకూరులోని ఆర్డీటీ క్రీడా మైదానం ఎదుట ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున నీరు చేరింది. ఎప్పుడు వర్షం వచ్చినా ఆ స్థలంలో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిల్వ ఉంటుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు అదే రహదారిలో వెళ్లాల్సి ఉండగా వర్షపు నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. చాలా మంది వర్షపు నీటిలో పడ్డారని, కొందరు సెల్‌ఫోన్లు కూడా పోగొట్టుకున్నారని పేర్కొన్నారు.

### వైభవంగా కాలభైరవుని ఫలపుష్పార్చన



కాలభైరవునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చక బృందం

**అనంతపురం కల్చరల్:** కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పూజలందుకుంటున్న కాలభైరవుడికి విశేష ఫలపుష్పార్చన ఘనంగా జరిగింది. చైత్రమాసంలో అరుదుగా వచ్చే అష్టమి సోమవారం కలిసి రావడంతో స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి దేవస్థానంలో కొలువుదీరిన చక్రసహిత అష్టకాలభైరవ లింగానికి ఉదయం రుద్రాభిషేకం, అనంతరం వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో భక్తులతో కలిసి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రతినిధి మఠం బసవరాజస్వామి మాట్లాడుతూ జిల్లాలోనే అష్టకాల భైరవ దేవాలయాలు అత్యంత అరుదుగా ఉన్నాయన్నారు. గ్రహదోష నివారణల కోసం ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజనానికి తీర్థప్రసాద వినియోగం జరిగింది.

### జులై 21న ఫారిన్ లాంగ్వేజెస్ ఫైనల్ పరీక్ష

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్డీటీ–ప్రొఫెషనల్ స్కూల్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ పీజీ డిప్లొమో కోర్సుకు సంబంధించి జులై 21న ఫైనల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్నల్ కమిటీని నియమించారు. ఈ కోర్సులో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థి రూ.750 పరీక్ష ఫీజు చెల్లించాలని నిర్దేశించారు. మొత్తం 55 మంది విద్యార్థులు కోర్సును పూర్తి చేయనున్నారు.

### ఉచితంగా బ్రాహ్మణ ధర్మోపనయనాలు

**అనంతపురం కల్చరల్:** బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్యుల జయంతి రోజున ఉచితంగా ధర్మోపనయాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శివరాం,రఘురామారావు తెలిపారు. సోమవారం నగరంలోని వారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 1983 నుంచి ధర్మోపనయనాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శాఖా భేదం లేకుండా జరిగే ఉపనయనాల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 25లోపు వటువు పేరు, వివరాలతో ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు, మరిన్ని వివరాలకు 9440090060, 9441506811 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రవికుమార్, రాఘవేంద్రజోషి తదితరులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న పంట దగ్ధం



మొక్కజొన్న పంట కాలిపోయిన దృశ్యం

**పుట్లూరు:** మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మొక్కజొన్న పంటతో పాటు బిందుసేద్య పరికరాలు దగ్ధమయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు మారుతీనాయుడు ఏడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఆదివారం పంటకు మంటలు వ్యాపించడంతో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్నతో పాటు 40 పైపులు, ఆరు డ్రిప్పు కట్టలు, ఇతర పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

### జోడు లింగాలకు ప్రత్యేక పూజలు

**కూడేరు:** మండల కేంద్రంలో వెలసిన పార్వతీ పరమేశ్వర స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం క్షీరాభిషేకం, రుద్రాభిషేకం పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సాక్షి
అనంతపురం
మంగళవారం । 22 । ఏప్రిల్ । 2025





## చీనీ టన్ను రూ.23,800

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23,800 పలికాయి.



## బిందెడు నీటికి బండెడు కష్టాలు!

కూటమి సర్కార్ ఘోర వైఫల్యాల కారణంగా పల్లెలన్నీ గొంతెండుతున్నాయి. గుక్కెడు నీటి కోసం గ్రామస్తులు పొలాల వెంబడి పరుగులు తీస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
40.4°/21.7°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### డ్రిప్ మంజూరులో జిల్లాకు అగ్రస్థానం

- నాలుగో స్థానంలో 'శ్రీసత్యసాయి'



అధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వర్లు

**అనంతపురం సెంట్రల్:** డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానం, జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం నగరంలో ప్రాంతీయ ఉద్యాన శిక్షణా సంస్థ కార్యాలయంలో మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్లు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా రాష్ట్రంలో నాలుగు, జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో ఉందని అభినందించారు. రైతుల పొలాల్లో పరికరాలను త్వరితగతిన అమర్చి సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు సహకరించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ రైతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వంద శాతం రైతులు డ్రిప్ వాడేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ అనంతపురం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రఘునాథరెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఏపీఎంఐపీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు



**అనంతపురం ఎడ్యుకేషన్:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు గడువు మంగళవారంతో ముగుస్తుందని ఇంటర్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం.వెంకటరమణ నాయక్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులు వెంటనే పరీక్ష ఫీజు సంబంధిత కళాశాలలో చెల్లించాలని సూచించారు. ఫీజు బకాయి ఉందనే సాకుతో ప్రైవేట్ జూనియర్ కళాశాలల యజమాన్యాలు విద్యార్థుల నుంచి కట్టించుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫెయిల్ అయిన విద్యార్థులందరూ తప్పనిసరిగా పరీక్ష ఫీజు చెల్లించేలా చూడాల్సిన బాధ్యత ఆయా కళాశాలల యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు.

### నేడు అనంత కోర్టుకు బోరుగడ్డ అనిల్

**అనంతపురం:** నగరంలోని మొబైల్ కోర్టుకు మంగళవారం బోరుగడ్డ అనిల్ హాజరుకానున్నారు. స్థానిక రామచంద్రానగర్ చర్చికి సంబంధించి ఆదాయం లెక్కింపు అంశంలో పోలీసులను దూషించాడనే అభియోగంతో ఆయనపై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు ఎస్కార్టుతో అనంతపురం కోర్టుకు తీసుకురానున్నారు.

### తగ్గుతున్న చింత పండు ధరలు



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

**హిందూపురం అర్బన్:** హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో గత మూడు వారాలుగా చింత పండు ధరలు పడిపోతున్నాయి. సోమవారం 881.70 క్వింటాళ్ల చింత పండు వచ్చింది. మార్కెట్‌లో ఈ నామ్ పద్ధతిలో వేలం పాటలు సాగాయి. కరిపులి రకం క్వింటా గరిష్ఠ ధర రూ.19,500, కనిష్ఠం రూ.8 వేలు, సగటు రూ.15 వేలు పలికింది. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్ఠ ధర రూ.12,500, కనిష్ఠం రూ.4,420, సగటు ధర రూ.8 వేలు పలికింది. గత వారంతో పోలిస్తే కరిపులి కరం క్వింటాపై రూ.1,000 తగ్గుదల కనిపించింది. వాతావరణ మార్పులు, చల్లదనంతో ధరలు తగ్గుముఖం పట్టినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.



నేమకల్లు సమీపంలో ఏర్పాటైన క్రషర్ యూనిట్

అధికార అండతో గత టీడీపీ ప్రభుత్వంలో సహజ వనరులను మామ కొల్లగొట్టాడు. తానేం తక్కువ అన్నట్లు అతని అల్లుడు కూడా ఇష్టారాజ్యంగా దోచేశాడు. జరిమానా విధిస్తే మామా అల్లుళ్లు పైసా కట్టలేదు. అలాంటి వారికి నియోజకవర్గ ప్రజా ప్రతినిధి కూడా సహకరిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది.

# అల్లుడూ.. కొల్లగొట్టుడే!

- నేమకల్లు సహజవనరులను ఊడ్చేసిన రఘుప్రతాప్
- మామ కాంతారావుతో కలిసి దోపిడీ
- ప్రతాప్ చెల్లించాల్సిన రూ.7 కోట్ల జరిమానాకు ఎగనామం
- అనుమతి లేకుండానే క్రషర్లతో కొండలను పిండిచేస్తున్న వైనం
- మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూస్తే ఒట్టు
- అండగా నిలిచిన 'దుర్గం' ప్రజాప్రతినిధి



**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఒకవైపు మామ.. మరోవైపు అల్లుడు కూడబలుక్కుని రాయదుర్గం నియోజకవర్గంలో సహజ వనరులకు నిలయమైన నేమకల్లును లూటీ చేశారు. అత్యంత నాణ్యమైన కంకర ఇక్కడ లభిస్తుంది. దీనికోసం కొండలను మొత్తం పిండిచేశారు. మామ టీవీఎస్ కాంతారావు, అల్లుడు రఘు ప్రతాప్‌లు నేమకల్లులో ఉన్న సహజ వనరులను పూర్తిగా ఊడ్చేశారు. పదుల సంఖ్యలో కంకర మిషన్లు, జేసీబీలు, రవాణా వాహనాలతో రాయదుర్గం నియోజకవర్గంలోని నేమకల్లు రణగొణ ధ్వనులతో మారుమోగిపోతోంది. యంత్రాల శబ్దాలు, కాలుష్యంతో చుట్టుపక్కల పల్లెలు అల్లాడిపోతున్నాయి.

**అనుమతి గోరంత..తవ్వింది కొండంత**

మామ కాంతారావు..అల్లుడు రఘుప్రతాప్ ఇద్దరూ మైనింగ్ మాఫియా డాన్‌లే. రఘుప్రతాప్‌కు సర్వే నంబర్ 253లో 4.6 హెక్టార్లలో మాత్రమే గతంలో మైనింగ్‌కు అనుమతి ఉండగా రమారమి 30 ఎకరాల్లో తవ్వినట్టు స్థానికులు చెబుతున్నారు. 2019లో అక్రమ మైనింగ్ జరిపారని అప్పటి మైనింగ్ అధికారులు విచారణ చేసి రూ.7.07 కోట్ల జరిమానా విధించారు. కానీ ఇప్పటివరకూ రఘుప్రతాప్ ఒక్క పైసా కట్టలేదు. పైగా ఇప్పుడు జరిమానా మాఫీ చేయించుకునేందుకు నేరుగా సీఎంఓ నుంచి పునః పరిశీలన అనుమతులు తెచ్చుకున్నారు. అప్పుడు జరిమానా విధించిన అధికారులతోనే ఇప్పుడు ఎలాంటి అక్రమాలు లేవని నివేదిక ఇప్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిడి తెస్తున్నారు. దీంతో మామ కాంతారావు కట్టాల్సిన రూ.13 కోట్లు, అల్లుడు రఘుప్రతాప్ కట్టాల్సిన రూ.7 కోట్లలో ప్రభుత్వానికి ఒక్క పైసా కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

**అనుమతులు లేకుండానే మైనింగ్**

ఓవైపు జరిమానాలు విధించారు. అవి ఇప్పటివరకూ కట్టనే లేదు. పోనీ కనీసం కొత్తగా అనుమతులైనా ఉన్నాయా అంటే అదీ లేదు. కూటమి సర్కారు వచ్చిన మరుసటి రోజు నుంచే మామా అల్లుళ్లు నేమకల్లు పరిసరాల్లో వాలిపోయారు. ఇక్కడ లభించే కంకరను కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే 40 ఎకరాల గుట్ట కరిగిపోయినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. భారీ వాహనాలతో రహదారులు ఛిద్రమయ్యాయి. నేమకల్లులో ఇలాగే మైనింగ్ కొనసాగితే భవిష్యత్తులో కొత్తగా ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు టిప్పర్ కంకర కూడా మిగిలేలా లేదని అక్కడి ప్రజలు వాపోతున్నారు.

**మైనింగ్ డీడీ ఉన్నా లేనట్టే...**

ఇటీవల జిల్లా గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు వచ్చారు. ఈయన ఆధ్వర్యంలో ఎక్కడా తనిఖీలు లేవు. ఎవరికి నచ్చినట్టు వారు దోపిడీ చేసుకోవచ్చు. దోపిడీ జరుగుతోందంటూ ఎవరైనా ఫోన్ చేసినా లిఫ్ట్ చేయరు. ప్రజా ప్రతినిధులు ఎవరైనా ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే.. 'నాకు ఇక్కడ పనిచేయాలని లేదు, ఎప్పుడు బదిలీ వచ్చినా వెళ్లిపోతా' అని చెబుతున్నారు. నేమకల్లు పరిసరాల్లో దోపిడీపై వివరణ కోరేందుకు డీడీకి ఫోన్ చేసినా స్పందించలేదు.

**పెచ్చుమీరిన ఆగడాలు..**

రాయదుర్గం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ గత కొన్ని నెలలుగా అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. మరోవైపు అక్రమ మైనింగ్‌తో కొండలను పిండి చేస్తున్నారు. వీటన్నింటినీ ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్నా 'కాలవ' కిమ్మనడం లేదు. మైనింగ్ మాఫియాకు పూర్తి స్థాయిలో రాజకీయ అండదండలున్నట్టు విమర్శలున్నాయి.

### 'అనంత ఆణిముత్యాలు' పునఃప్రారంభం

- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్

**రాప్తాడు:** పేద విద్యార్థుల కోచింగ్‌లకు, కార్పొరేటు స్కూళ్లు, కళాశాలల్లో విద్యనభ్యసించేలా చేయూతనందించేందుకు 'అనంత ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని పునఃప్రారంభించినట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయ నగర్‌లో ఆర్‌జేసీ కల్యాణ మండపంలో 'అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ సొసైటీ'కి రూ.1,34,116 మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2009లో సొసైటీ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే ఏడుగురు విద్యార్థులు లబ్ధి పొందారన్నారు. అప్పట్లో అందిన విరాళాలతో సొసైటీ కార్యకలాపాలు బాగా నడిచాయని, తర్వాత కొన్నాళ్లకే ఆగిపోయాయన్నారు. పేద విద్యార్థులకు సాయమందించాలనే ఉద్దేశంతో పునఃప్రారంభించామన్నారు. తన వంతు సహాయంగా రూ.10 వేలు అందించినట్లు తెలిపారు. ఉద్యోగులు, ప్రజలు కూడా చేయూతనందించాలన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్, అకౌంట్ నంబర్–1429 1001 1001 235, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0814296కు విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం

- కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్
- రాప్తాడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వివిధ సమస్యలపై 407 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

**రాప్తాడు:** ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపే బాధ్యత తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ ఆర్‌జేసీ కల్యాణ మండపంలో నిర్వహించిన 'జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం అర్జీదారులతో కిటకిటలాడింది. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జునుడు, రామ్మోహన్, డీఆర్వో మలోల ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 407 వినతులు అందాయి. ఎక్కువ భాగం భూ సమస్యలపైనే ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అర్జీల్లో 70 నుంచి 80 శాతం పరిష్కారం చూపుతున్నారని, వంద శాతం పరిష్కరించేలా కృషి చేయాలని ఆదేశించారు.

**వినతుల్లో కొన్ని...**

- రాప్తాడు సమీపంలో రైల్వే వంతెన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, పనులు ప్రారంభించి ఏడేళ్లవుతున్నా నేటికీ పూర్తి కాలేదని సర్పంచు సాకే తిరుపాల్ విన్నవించాడు. పండమేరు వంక (జేఎన్‌టీయూ) రహదారిలో బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరాడు. వంక సమీపంలో ప్రభుత్వ స్థలం 25 ఎకరాల్లో పార్క్ మంజూరు చేయాలని, రాప్తాడు ఏపీ మోడల్ స్కూల్‌కు కాంపౌడ్ వాల్ ఏర్పాటు చేయాలన్నాడు. పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించాడు.
- రాప్తాడు మండలంలోని మరూరు రెవెన్యూ గ్రామంలో భూమి రిజిస్ట్రేషన్‌కు సబ్ రిజిస్ట్రార్ ఎకరాకు రూ.1.50 లక్షలు అడుగుతున్నారని మరూరు గ్రామానికి చెందిన నారాయణస్వామి, కొండారెడ్డి, వీర నారప్ప, ఆదినారాయణ, నరసింహులు తదితరులు ఫిర్యాదు చేశారు.
- అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ బీఎస్‌ఆర్ కాలనీలో 1996లో 3 సెంట్ల చొప్పున స్థలం పంపిణీ చేశారని, ఈ క్రమంలో తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని పలువురు కాలనీ వాసులు కోరారు.



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు పరదేశి లక్ష్మీదేవి. బుక్కరాయసముద్రం మండలం గాంధీ నగర్‌వాసి. కుమారుడు గురుమూర్తి, కుమార్తె లక్ష్మీదేవిని వృద్ధురాలు ఎంతో గారాబంగా పెంచింది. ఇద్దరికీ వివాహాలు కూడా చేసింది. కుమారుడు గురుమూర్తి మృతి చెందాడు. కుమార్తె లక్ష్మీదేవి కొన్నేళ్ల క్రితం భర్తతో గొడవపడి బసగానపల్లి నుంచి వచ్చేసి తల్లి దగ్గర ఉండేది. తల్లిని నమ్మించి రూ.3 లక్షలు నగదు, 3 తులాల బంగారు నగలు, 2 సెంట్ల స్థలం, 1–25 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకున్న లక్ష్మీదేవి... ఆ తర్వాత ఇంటి నుంచి ఆమెను బయటకు గెంటేసింది. 'దిక్కున్న చోట చెప్పుకో ఇచ్చేదే లేదు' అంటూ దాడి చేసింది. దీంతో దిక్కు తెలియని వృద్ధురాలు రాప్తాడులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తనకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం సమర్పించింది.

## అధికారుల తీరు.. జనం బేజారు

**అనంతపురం అర్బన్:** 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' మార్పుపై ముందస్తు సమాచారం ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందికి గురిచేసింది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని రాప్తాడు మండలానికి మార్చారు. ఈ విషయాన్ని కేవలం ఒక రోజు ముందు అంటే ఆదివారం ప్రకటన ద్వారా తెలియజేశారు. దీంతో సమాచారం గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరలేదు. ఈ క్రమంలో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్ చేరుకున్నారు. సెక్యూరిటీ గార్డ్, పోలీసుల ద్వారా వేదిక మార్పు విషయం తెలుసుకుని కొందరు రాప్తాడు వెళ్లగా.. మరికొందరు అధికారులను తిట్టుకుంటూ వెనుదిరిగారు.

**సమాచారం ఇలా ఇస్తే మేలు...**

- పరిష్కార వేదికను మార్పు చేసినప్పుడు ఆ విషయాన్ని రెండు రోజుల ముందే ప్రకటిస్తే వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- ప్రతి గ్రామానికి వీఆర్‌ఓలు ఉంటారు. వేదిక మార్పు విషయంపై తహసీల్దార్ల ద్వారా వారికి ఆదేశాలిస్తే... వారు తమ పరిధిలోని గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు తెలియజేస్తారు.

# దోచేందుకు చెత్త ఐడియా!

- అద్దె ట్రాక్టర్ల అడ్డగోలు బాగోతం
- రోజూ తిరగని వైనం
- జీపీఎస్ లేకుండా మాయ
- అధికారుల తీరుపైనా సందేహాలు



చిన్న సైజు ట్రాలీలో చెత్తను తీసుకెళ్తున్న దృశ్యం

| | |
|---|---|
| నగరపాలక సంస్థ వాహనాలు | 53 |
| అద్దె ట్రాక్టర్లు | 30 |
| ఒక్కో ట్రాక్టర్‌కు రోజుకు చెల్లించేది | రూ.2,100 |

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వంలో సంపాదనే పరమావధిగా అధికార పార్టీ నాయకులు ముందుకెళ్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే చందాన ప్రజాధనాన్ని ఊడ్చేస్తున్నారు. నగరంలో 50 డివిజన్ల నుంచి రోజూ 140 టన్నుల నుంచి 150 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. నిత్యం ఈ చెత్త తరలించేందుకు 30 అద్దె ట్రాక్టర్లను తీసుకోవాలని ఇటీవల నిర్ణయించారు. ఆరు నెలల పాటు ఒక్కో ట్రాక్టర్‌కు రోజు అద్దె రూ.2,100 చెల్లించేలా ఈ ఏడాది ఫిబ్రవరి 24న రూ.1.35 కోట్లతో టెండర్లను ఆహ్వానించారు. మార్చి నుంచి అద్దె ట్రాక్టర్ల ద్వారా చెత్త తరలించే పద్ధతి అమలులోకి వచ్చింది.

**అంతా మాయే..**

చెత్త ట్రాక్టర్ల నిర్వహణకు సంబంధించి పెద్ద గోల్‌మాల్ నడుస్తోంది. ప్రతి డివిజన్‌లో రోజూ అద్దె ట్రాక్టర్లు 1,000 నుంచి 1,100కుపైగా ఇళ్లను కవర్ చేయాలి. ఈ విధంగా మూడు ట్రిప్పుల వరకు తిరగాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. డివిజన్లకు రోజు మార్చి రోజు అద్దె ట్రాక్టర్లు వస్తున్నాయి. ఇక.. చెత్త తరలించే ట్రాక్టర్లను చూస్తే ఎవరైనా నివ్వెర పోవాల్సిందే. ఇసుక తరలించే ట్రాక్టర్ల కంటే మరీ చిన్నవిగా ఉంటున్నాయి. అందులో కనీసం వంద ఇళ్ల చెత్త కూడా పట్టదు. దీంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా తీసుకెళ్లేలా ట్రాక్టర్‌లో ఏర్పాట్లు ఉండటం లేదు. అద్దె ట్రాక్టర్ల నిర్వాహకులు చెత్తను తరలించేందుకు సొంతంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నా.. చాలా మంది నగరపాలక సిబ్బందినే వాడుకుంటున్నారు. ట్రాక్టర్లకు 'జీపీఎస్' లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది.

**అధికారుల కుమ్మక్కు..**

నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఓ ఈఈ, డీఈ, ప్రజారోగ్యాధికారులు అద్దె ట్రాక్టర్ల కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర విభాగాల్లో కొందరు అధికారులు, సిబ్బంది టీడీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చివరకు ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న చెత్త తరలింపు విషయంలోనూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురి చేస్తోంది.

**రోజు మార్చి రోజు వస్తున్నారు**

చెత్త తరలించేందుకు వాహనాలు రోజూ రావడం లేదు. రోజు మార్చి రోజు వస్తున్నాయి. గతంలో ఇంటింటికీ వాహనాలు వచ్చేవి. చెత్తను ఎప్పటికప్పుడు తీసుకెళ్తే బాగుంటుంది.

– కుళ్లాయప్ప, ఎర్రనేలకొట్టాలు, అనంతపురం

## కత్తి పోటుకు గురైన యువకుడి మృతి

- గొడవ పడుతున్న వారిని విడిపించేందుకు యత్నించడమే శాపంగా మారిన వైనం



మహేష్‌కుమార్ (ఫైల్)

**తాడిపత్రి టౌన్:** ఈ నెల 16న కత్తి పోటుకు గురైన యువకుడు బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడి గ్రామానికి చెందిన మహేష్‌కుమార్ (29)కు తాడిపత్రిలోని ఓం శాంతి నగర్‌లో నివాసముంటున్న మణితో వివాహమైంది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వచ్చిన భార్యను పిలుచుకెళ్లేందుకు ఈ నెల 16న మహేష్‌కుమార్ తాడిపత్రికి వచ్చాడు. అదే రోజు తన అత్తింటి పక్కనే ఉన్న ఫైరోజ్ తన కుటుంబసభ్యులు రమీజా, ఖాజీబీతో గొడవపడుతుంటే మహేష్‌కుమార్ జోక్యం చేసుకుని విడిపించే ప్రయత్నం చేశాడు. అప్పటికే కూరగాయల కత్తితో తన కుటుంబసభ్యురాలిపై ఫైరోజ్ దాడి చేయబోతుండగా అడ్డుగా ఉన్న మహేష్‌కుమార్ పొట్టను తాకడంతో లోతైన గాటు పడింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక (తాడిపత్రి) ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన అక్కడి వైద్యులు చిన్నపాటి గాయమేనంటూ మూడు కుట్లు వేసి ఇంటికి పంపారు.అయితే కడుపు నొప్పి అంటూ బాధపడుతుండడంతో మరుసటి రోజు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి పిలుచుకెళ్లారు. అక్కడ రెండు రోజుల పాటు అడ్మిషన్‌లో ఉంచుకుని సాధారణ చికిత్స అందిస్తుండడంతో పరిస్థితి కాస్త విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించిన అనంతరం కడుపులో పేగు తెగిందని నిర్ధారించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తీసుకెళ్లాలని చేతులెత్తేశారు. దీంతో కుటుంబసభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మహేష్‌కుమార్ సోమవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



పెద్దవడుగూరు మండలం అప్పేచర్లలో విరిగిపడిన బొప్పాయి చెట్లను చూపుతున్న బాధిత రైతు

- 21 మండలాల్లో అకాల వర్షం

**అనంతపురం అగ్రికల్చర్:** ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు 21 మండలాల పరిధిలో 12.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఆత్మకూరులో 72.2 మి.మీ, గుంతకల్లు 68.2 మి.మీ భారీ వర్షం కురిసింది. వజ్రకరూరు 46.2 మి.మీ, శెట్టూరు 34.4,కుందుర్పి 29.6, కళ్యాణదుర్గం 29.4, కంబదూరు 18.6, బ్రహ్మసముద్రం 17, బెళుగుప్ప 15.2, గుత్తి 14.4, రాయదుర్గం, గుమ్మఘట్ట 10.2 మి.మీ వర్షం కురిసింది. రాప్తాడు, విడపనకల్లు, కణేకల్లు, పామిడి, ఉరవకొండ, డీ.హీరేహాళ్, పెద్దవడుగూరు, యాడికి, బొమ్మనహాళ్ మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీయడంతో రూ.2 కోట్ల మేర పంటనష్టం వాటిల్లినట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తితో పాటు అరటి, చీనీ, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి.

# బిందెడు నీటికి బండెడు కష్టాలు

## క్లుప్తంగా

### 'ప్రతి ఎకరాకూ కృష్ణా జలాలు అందించాలి'



హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

**గుంతకల్లు రూరల్:** హంద్రీ-నీవా కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు కృష్ణా జలాలు అందించాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు కసాపురం రమేష్‌తో కలసి సోమవారం ఆయన జి.కొట్టాల వద్ద చేపట్టిన హంద్రీ-నీవా కాలువ పనులను పరిశీలించి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు హంద్రీ-నీవా కాలువను 10వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉండేలా వెడల్పు చేయాలన్నారు. అప్పటి వరకూ కాలవకు లైనింగ్ పనులు చేయరాదన్నారు. రాగులపాడు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాల్లోని గ్రామాలకు తాగు, సాగు నీటిని అందించాలన్నారు.

- కూటమి అధికారంలోకి వచ్చాక శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిర్వీర్యం
- వేతనాలు అందించలేని దుస్థితిలో 'బాబు' సర్కార్
- ఈ నెల 6 నుంచి సమ్మెలో కార్మికులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 727 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా

**రాయదుర్గం:** ఉమ్మడి జిల్లాల్లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల పరిధిలో ఉన్న 727 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. కూటమి సర్కార్ ఘోర వైఫల్యాల కారణంగా పల్లెలన్నీ గొంతెండుతున్నాయి. గుక్కెడు నీటి కోసం గ్రామస్తులు పొలాల వెంబడి పరుగు తీస్తున్నారు.

**16 రోజులుగా నిలిచిపోయిన తాగునీటి సరఫరా**

లక్షలాది మంది గొంతు తడిపే అతిపెద్ద శ్రీరామరెడ్డి తాగునీటి పథకాన్ని అధికారం చేపట్టి పట్టుమని పది నెలల కాకనే చంద్రబాబు సర్కార్ అటకెక్కించింది. నిర్వహణ చేతకాక చేతులెత్తేసింది. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో 16 రోజులుగా కార్మికులు సమ్మె బాటపట్టారు. దీంతో తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా శ్రీరామరెడ్డి తాగునీటి పథకం లబ్ధి పొందుతున్న గ్రామాల్లో ప్రజలు కన్నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.

**వ్యవసాయ బోర్లే దిక్కు**

ఉమ్మడి జిల్లాల్లోని చాలా గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్ సరఫరా ప్రారంభం కాగానే పొలాల్లోకి పరుగులు తీస్తున్నారు. రైతుల నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను మౌనంగా భరిస్తూ తమ నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. నీటి కష్టాలు చూసిన ట్యాంకర్ల నిర్వాహకులు ధర అమాంతం పెంచేశారు. పట్టణాల్లో ఒక్కో ట్యాంకర్‌కు రూ.800 నుంచి రూ. వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. అది కూడా అర్ధరాత్రి సమయంలో ట్యాంకర్లు వస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



వ్యవసాయ బోరు వద్ద ట్యాంకర్లకు పడుతున్న నీరు

**శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వివరాలు**

| | |
|---|---|
| ఉమ్మడి జిల్లాలో తాగునీరందే గ్రామాలు | 727 |
| రోజూ సరఫరా చేసే నీటి సామర్థ్యం | 47 ఎంఎల్‌డీ |
| ఉమ్మడి జిల్లాలో మొత్తం కార్మికులు | 588 మంది |
| సూపర్‌వైజర్లు | 20 మంది |
| పేరుకు పోయిన జీతాల బకాయిలు | రూ.8 కోట్లు |

### సమ్మె విరమిస్తేనే ప్రయోజనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో 800 మంది కార్మికులు పనిచేస్తుండగా కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక వివిధ కారణాలతో ఆ సంఖ్య 630కి కుదించారు. సూపర్‌వైజర్లు మరో 20 మంది ఉన్నారు. నిత్యం 47 ఎంఎల్‌డీ నీటిని ఉరవకొండ నియోజకవర్గం పీఏబీఆర్ పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వచ్చింది. దీంతో కార్మికుల వేతన బకాయిలు రూ.8 కోట్లకు చేరుకుంది. పలు దఫాలుగా నిరసనలు వ్యక్తం చేసినా... చర్చల పేరుతో కార్మికులను మభ్యపెట్టారు తప్ప సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. దీంతో గత్యంతరం లేని స్థితిలో కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. నిండు వేసవిలో 16 రోజులుగా తాగునీటి పథకం ద్వారా నీరందక పోవడంతో ప్రజల ఇక్కట్లు నానాటికీ జటిలమవుతున్నాయి. కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరితేగాని సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.



తోపుడు బండిపై నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తుడు

**ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం**



శ్రీరామిరెడ్డి పథకం తాగునీరే మాకు దిక్కు. ఊర్లో బోర్లలో నీరు ఉప్పుగా ఉంటున్నాయి. వాటిని తాగలేక పోతున్నాం. ఎండకాలంలో ఇంతటి కష్టం వస్తోందని అనుకోలేదు.

– మారెక్క, గోనబావి, గుమ్మఘట్ట మండలం

**రెండు రోజుల్లో పరిష్కారం**

కార్మికులతో చర్చలకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. సమస్యకు ఒకట్రెండు రోజుల్లో పరిష్కారం దక్కుతుంది. రూ.8 కోట్ల వేతన బకాయిలు చెల్లించేలా నివేదికలు సమర్పించారు. త్వరలో కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి. లీకేజీలు తాత్కాలికంగా అరికట్టేలా చర్యలు తీసుకుంటాం. కొత్త లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు చేపట్టాం.

– శిరీష, శ్రీరామిరెడ్డి పథకం డీఈ, అనంతపురం

**ఇబ్బందులు పడుతున్నాం**



మా గ్రామానికి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ఒక్కటే ఆధారం. సిబ్బంది సమ్మెలో వెళ్లినప్పటి నుంచి నీళ్లు రావడం లేదు. తాగునీళ్లతో పాటు ఇతర అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

– నూర్జహాన్‌బీ, సొల్లాపురం, కణేకల్లు మండలం

**కుస్తీ పట్టాల్సి వస్తోంది**



ట్యాంకర్ ఊళ్లోకి వస్తే జనమంతా ఒక్కసారిగా చుట్టుముడుతున్నారు. నీళ్ల కోసం కుస్తీలు పట్టాల్సి వస్తోంది. ఇంత కష్టపడినా నీళ్లు అరకొరగా దొరుకుతాయి. వచ్చే సోమవారం ఊళ్లో రామాలయం ప్రారంభం ఉంది. ఈ వేడుకకు చుట్టాలను ఆహ్వానించాం. నీళ్ల కోసం ఎన్ని తిప్పలు పడాలో అర్థం కావడం లేదు.

– పద్మజ, సొల్లాపురం, కణేకల్లు మండలం

**పట్టించుకోవడం లేదు**



16 రోజులుగా శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా ఆగిపోయింది. బిందెడు నీటి కోసం ఇంతటి దౌర్భాగ్యం ఎదుర్కొవాల్సి వస్తోందని కలలో కూడా అనుకోలేదు. ప్రతి గ్లాస్ నీటిని పొదుపుగా వాడుకోవాల్సి వస్తోంది.

– జయమ్మ, గోవిందవాడ, బొమ్మనహాళ్ మండలం



సొల్లాపురంలో అర్ధరాత్రి ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న దృశ్యం



## ప్లాట్లు అమ్మారు.. మోసగించారు

- విశ్వాస్ రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై బాధితుల ఫిర్యాదు

**రాప్తాడురూరల్:** కర్నూలు జిల్లా క్రిష్టగిరి మండలం అమకతాడు టోల్‌ప్లాజా సమీపంలో విశ్వాస్ రియల్ ఎస్టేట్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వీవీకే విజన్ సంస్థ పేరుతో ప్లాట్లు వేసి విక్రయించి మోసగించారని బాధితులు వాపోయారు. ఈ మేరకు సోమవారం కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి ఫిర్యాదు చేశారు. బాధితులు పి.శ్రీనివాసులు, ఆర్.రమేష్, పీఎస్‌కే శిరీష్, రామకృష్ణాచారి, ఎం.ప్రసాద్‌రావు, ఎం.వెంకటసాయి కృష్ణ, ఎం.రేవంత్‌కుమార్, కె.రమాదేవి, ఎం.పద్మసుప్రియ, బి.శైలజ తదితరులు తెలిపిన వివరాల మేరకు.. అమకతాడు గ్రామ పొలం 275, 276, 290, 291, 318-బీ, 319-బీ, 321-బీ, 320, 321-ఏ సర్వే నంబర్లలో 130 ఎకరాల్లో 4, 5, 2.25 సెంట్ల ప్రకారం 1,500కు పైగా ప్లాట్లు వేసి దాదాపు ఆరేళ్ల కిందట విక్రయించారు. జిల్లాలోని బాధితులు ఎక్కువగా 2.25 సెంట్ల ప్లాట్లను కొనుగోలు చేశారు. అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల వారే వందలాది ప్లాట్లు కొన్నారు. వెంచర్ నిర్వాహకులు పెద్దపెద్ద రోడ్లు, రీసార్ట్స్, పార్కులు ఏర్పాటు చేస్తామంటూ నమ్మబలికి అరచేతిలో వైకుంఠం చూపించారు. అయితే..ఇప్పటిదాకా లేఔట్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు. పైగా నాలుగు రోజుల కిందట దాదాపు 30 ఎకరాల వరకు ప్లాట్లను తొలగించి చదును చేశారు. ఆయా సంస్థల యజమానులు వి.విజయ్‌కుమార్, అమకతాడు నివాసి కోయకుండ వీరభద్రుడు కలిసి ఈ భూమిని చదును చేసి ఇతరులకు విక్రయించాలని చూస్తున్నారు. దీనిపై బాధితులు కర్నూలు కలెక్టర్‌ను కలసి తమను మోసం చేయాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## యువకుడి దుర్మరణం

- ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు



మృతుడు సాయితేజ

**చెన్నేకొత్తపల్లి:** ద్విచక్ర వాహనాలు కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రామగిరి మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన సాయితేజ (24) సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ధర్మవరానికి బయలుదేరాడు. ప్యాదిండి గ్రామానికి అదే గ్రామానికి చెందిన రమేష్ మరో ద్విచక్ర వాహనంపై ధర్మవరానికి వెళుతూ సాయితేజ వాహనం వెనుకనే అనుసరించసాగాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోకి చేరుకోగానే ధర్మవరం వైపు నుంచి ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు తొలుత సాయితేజ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని, తర్వాత వెనుకనే ఉన్న రమేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను స్థానికులు ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై సీకే పల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## కాలువ లైనింగ్‌తో రైతులకు విఘాతం

- జల సాధన సమితి నాయకులు

**అనంతపురం:** హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులతో అనంత రైతన్న తీవ్రంగా నష్టపోతాడని జల సాధన సమితి నాయకుడు, ప్రముఖ న్యాయవాది రామకుమార్ అన్నారు. 'రాయలసీమ కరువు-నీటి సవాళ్లు- వాటి పరిష్కార మార్గాలు - సాధ్యాసాధ్యాలు' అంశంపై శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఏ (ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ ) రాష్ట్ర అధ్యక్షుడు వేమన ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాయలసీమలో ప్రతి ప్రాంతానికి హంద్రీ-నీవా ద్వారా నీరు ఇచ్చినప్పుడే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుందన్నారు. ప్రస్తుతం 53 వేల ఎకరాల భూమితో పాటు అదనంగా మరో 44 వేల ఎకరాల భూమిని అమరావతి రాజధాని ప్రాంతానికి సేకరించి మరోసారి నిర్బంధ అభివృద్ధి కేంద్రీకరణ చేస్తున్నారన్నారు. ఫలితంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తీరని అన్యాయం చేస్తున్నారని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. సిద్దేశ్వరం వద్ద కృష్ణా నదిపై కేంద్రం నిర్మిస్తున్న నేషనల్ హైవేలో భాగంగా తీగల వంతెన నిర్మాణం బదులుగా బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ నిర్మించాలని ప్రభుత్వం కోరకపోవడం అన్యాయమన్నారు. కర్ణాటకలో చేటపట్టిన అప్పర్‌భద్ర నిర్మాణాన్ని మన పాలకులు ఆపలేకపోవడంతో రాయలసీమ పశ్చిమ ప్రాంతానికి జీవనాధారమైన హెచ్చెల్సీ, ఎల్ఎల్సీ ఆయకట్టు పూర్తిగా ఎడారిగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమ ఉద్యమానికి సోషల్ మీడియా ద్వారా చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకుడు సాకే హరి, అశోక్ వర్ధన్, రామాంజినేయులు, రాహుల్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు వెంకటేశ్, లక్ష్మీవిశ్వనాథ్, హరిత, అరుణోదయ కళాకారులు చంద్రన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది రామ్‌కుమార్

### కానిస్టేబుల్‌పై దాడి

**ధర్మవరం అర్బన్:** విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై ఐదుగురు యువకులు దాడికి పాల్పడ్డారు. ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి 10.30 గంటలకు బీట్‌లో భాగంగా స్థానిక కదిరి గేటు వద్దకు కానిస్టేబుల్ విశ్వనాథ్ వెళ్లారు. ఆ సమయంలో అక్కడ రాజు అనే వ్యక్తి ఎగ్‌రైస్ బండి నిర్వహిస్తుండడం గమనించి, సమయం మించి పోయిందని, వ్యాపారాన్ని ఆపి ఇంటికెళ్లాలని సూచించారు. దీంతో రాజు వాగ్వాదానికి దిగాడు. ఎంత సర్ది చెప్పినా వినకుండా తన స్నేహితులను పిలిపించుకుని కానిస్టేబుల్ విశ్వనాథ్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజు, అతని స్నేహితులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య

- 20 రోజుల తర్వాత వెలుగు చూసిన ఘటన

**బత్తలపల్లి:** మండలంలోని యర్రాయపల్లి ఓబులేసుని కొండలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గొర్రెల కాపరులు సోమవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని తాడిమర్రి మండలం పూలఓబయ్యపల్లికి చెందిన శెట్టిపల్లి శివారెడ్డి(43)గా గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించి మృతుడిని శివారెడ్డిగా నిర్ధారించి, బోరున విలపించారు. ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఓ ఫర్టిలైజర్ షాపులో పని చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది పండుగ నుంచి కనిపించకుండా పోయాడని.. ఘటనపై అప్పట్లోనే ధర్మవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కాగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రేపు షీప్ యూనియన్ మహాజన సభ

**అనంతపురం అగ్రికల్చర్:** గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల జిల్లా సమాఖ్య మహాజన సభ ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు యూనియన్ పర్సన్ ఇన్‌చార్జి డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురంలోని పశుసంవర్ధకశాఖ జేడీ ప్రాంగణంలో ఉన్న యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగే వార్షిక మహాజన సభకు సహకార సంఘాల అధ్యక్షులు, పర్సన్ ఇన్‌చార్జిలు, డైరెక్టర్లు హాజరుకావాల్సి ఉంటుంది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షులను అభినందించడం, పరిచయాలు, ఏడాది ప్రగతికి సంబంధించి ఆడిట్ రిపోర్టులు, ఎన్‌సీడీసీ రుణాల రికవరీలపై చర్చ, యూనియన్‌లో గౌరవ వేతనంతో పనిచేస్తున్న రామలింగయ్య జీతభత్యాల పెంపుపై చర్చ, జూన్‌లో ముగియనున్న సంఘాలకు ఎన్నికలు, జిల్లా సమాఖ్య ఎన్నికలు, యూనియన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చకు అజెండా రూపొందించారు.

## బస్టాండ్‌లో ప్రయాణికురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

**తాడిపత్రి టౌన్:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఓ గుర్తు తెలియని ప్రయాణికురాలు (70) మృతి చెందింది. ఆదివారం రాత్రి బస్టాండ్‌కు చేరుకున్న వృద్ధురాలు కుర్చీలో కూర్చొని అలాగే కన్ను మూసింది. అయితే అర్ధరాత్రి కావస్తున్నా చలనం లేకపోవడంతో అనుమానం వచ్చిన ఆర్టీసీ సిబ్బంది ఆమెను పలకరించే ప్రయత్నం చేశారు. ఎలాంటి ఉలుకుపలుకు లేకపోవడంతో మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తాడిపత్రి పోలీసులను సంప్రదించాలని కోరారు.

## పొలంలో వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**పుట్లూరు:** మండలంలోని జి.వెంగన్నపల్లి సమీప పొలంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తెల్లని దుస్తులు ధరించిన దాదాపు 50 సంవత్సరాల వయసున్న వ్యక్తి రెండు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎండ తీవ్రతకు శరీరం నల్లబారి, బొబ్బలు తేలాయి. గుర్తు పట్టలేని స్థితిలో దుర్వాసన వెదజల్లుతోంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని పుట్లూరు పోలీసులు కోరారు.

## అధికారులదీ అదే తీరు!

- వ్యవసాయ పథకాల అమలులో అడుగడుగునా అలసత్వం

**అనంతపురం అగ్రికల్చర్:** పాలకుడు సమర్థుడైతే.. అధికారులు సైతం విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటారని పెద్దలు అంటుంటారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ పనితీరు ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. యథా రాజా... తథా అధికారులు అనే విధంగా రైతు సంక్షేమాన్ని పట్టించుకోని కూటమి సర్కార్ బాటలోనే జిల్లా వ్యవసాయ శాఖ నడుస్తోంది. వ్యవసాయశాఖ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు రైతు దరికి చేరడం లేదు. గత ఖరీఫ్, రబీలో పూర్తి స్థాయిలో రాయితీ విత్తన వేరుశనగ, పప్పుశెనగ, కందులు, అలాగే ప్రత్యామ్నాయ విత్తనాలు అందించకుండానే చేతులెత్తేశారు. తాజాగా జిల్లాకు కేటాయించిన రూ.3 కోట్ల యాంత్రీకరణ బడ్జెట్ కూడా ఖర్చు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. యాంత్రీకరణ కింద రోటావీటర్లు, వివిధ రకాల స్ప్రేయర్లు, టిల్లర్లు, ఇతరత్రా పనిముట్లు రైతులకు చాలా వరకు అవసరం ఉన్నా... ప్రచార లోపం, సమన్వయం కొరవడటంతో ఇంకా రూ.1.30 కోట్ల బడ్జెట్ మిగిలిపోయే పరిస్థితి నెలకొంది. వ్యవసాయ యాంత్రీకరణ కింద 1,661 యూనిట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు.

**ప్రహసనంలా డ్రోన్ల మంజూరు..**

ఆర్‌కేవీవై కింద జిల్లాకు కమ్యూనిటీ హైయరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) గ్రూపులకు 80 శాతం రాయితీతో కిసాన్ డ్రోన్లు మంజూరు చేస్తామంటూ ఆరు నెలలుగా చెబుతున్నా... ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. 35 కిసాన్ డ్రోన్లు మంజూరుకు గాను డ్రాగో కంపెనీ డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలు, విహంగ కంపెనీ డ్రోన్ ఖరీదు రూ.9.81 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో ప్రస్తుతం రైతు గ్రూపులు తమ వాటా కింద 50 శాతం చెల్లించాలని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామంటున్నారు. డ్రోన్ ఇచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత రైతుకు రాయితీ జమ చేస్తామని మెలికపెట్టడంతో ఇప్పటికిప్పుడు రూ.5 లక్షలు కట్టడానికి రైతు గ్రూపులు మొగ్గు చూపడం లేదు. అక్కడక్కడ కొందరు రైతులు ముందుకు వస్తున్నా... వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి తిరస్కరిస్తున్నారు. దీంతో కిసాన్ డ్రోన్ల మంజూరు కాస్త ఓ ప్రహసనంలా మారింది.





జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం

**నత్తనడకన రైతు విశిష్ట సంఖ్య నమోదు..**

ప్రతి రైతుకూ ఆధార్ తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రక్రియ కాస్త సాంకేతిక సమస్యల కారణంగా మందకొడిగా సాగుతోంది. 3.40 లక్షల మందికి విశిష్ట సంఖ్య కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నా... 1.98 లక్షల మందికి పూర్తి చేశారు. దీని కోసం రైతులు ముందుకు వస్తున్నా యాప్ సక్రమంగా పనిచేయక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమస్య పరిష్కారానికి అధికారులు మొగ్గు చూపకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

**అందుబాటులో లేని అధికారులు..**

పీఎం కిసాన్ కింద తమకు రూ.2 వేలు సొమ్ము జమ కావడం లేదని రోజూ రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సమస్యలు చెప్పుకునేందుకు వస్తున్న రైతులకు అధికారులు అందుబాటులో ఉండటం లేదంటున్నారు. స్వయానా జిల్లా అధికారే కార్యాలయంలో గంట కూడా ఉండటం లేదని విమర్శలు వెల్లువెత్తాయి. కలెక్టర్, కమిషనర్ సమీక్షలు, జూమ్ కాన్ఫరెన్స్‌లు, క్యాంప్‌లంటూ ఉన్న సమయమంతా వారికే కేటాయించేస్తున్నారు. అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, కరువు మండలాల ప్రకటన అంశంలో చంద్రబాబు ప్రభుత్వం రైతులను దగా చేస్తుంటే మరో పక్క వ్యవసాయశాఖ కూడా తన వంతు బాధ్యతగా సర్కారు బాటలోనే నడుస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.